

# అల్లు అర్జున్, అట్లీల అంతర్జాతీయ చిత్రం

'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత అల్లు అర్జున్ ఇమేజ్ ఆకాశమంత ఎత్తుకు చేరుకుంది. దాంతో ఆయన తాజా సినిమాకోసం అభిమానులేకాక, సగటు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఐకాన్‌స్టార్ కొత్త సినిమా అప్‌డేట్ వచ్చేసింది. మంగళవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా కొత్త సినిమా అప్‌డేట్‌ని తెలియజేస్తూ.. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ, హాలీవుడ్ టెక్నీషియన్స్‌పై చిత్రీకరించిన ఓ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. పానిండియా డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ అంతర్జాతీయ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'A22 x A6'గా పిలవబడుతున్న ఈ చిత్రం భారతీయ విలువలతో కూడిన కథనంతో ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షించేలా యాక్షన్, భావోద్వేగాలు ఉంటాయని, అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ స్థాయి మేకింగ్‌తో సినిమా రూపొందనున్నదని మేకర్స్ వెల్లడించారు. ఈ ఏడాది చివర్లో చిత్రీకరణ మొదలుకానున్న ఈ పానిండియా సినిమాకు సంబంధించిన మిగతా విషయాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

# హనుమంతుడి పాత్ర నాకో సవాల్



'ఈ రోజు ఇలా ఉన్నామంటే కారణం భగవంతుడు. దైవకృప వల్లే సృష్టి నడుస్తున్నదని ప్రగాఢంగా నమ్ముతా. 'రామాయణ'లో హనుమంతుడిగా మీ ముందుకు రాబోతున్నా. ఒక నటుడిగా నాకిది సవాల్.' అని సన్నీడియోల్ అన్నారు. బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ 'రామాయణ' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నితేష్ తివారీ దర్శకుడు. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తున్న ఈ పౌరాణిక హిందీ చిత్రంలో యశ్ రావణుడిగా కనిపించనున్నారు. ఆంజనేయుడి పాత్రను సన్నీడియోల్ పోషిస్తున్నారు. తాజాగా ఈ పాత్ర గురించి ఓ ఇంటర్వ్యూలో సన్నీ మాట్లాడారు. 'నాకు స్వతహాగా ఈ తరహా పాత్రలు ఇష్టం. ఎందుకంటే సరదాగా ఉంటాయి. తేలిగ్గా జనాల్లోకి వెళ్లిపోతాయి. ఇప్పటివరకూ షూటింగ్‌లో అయితే పాల్గొనలేదు. అవతార్, ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ చిత్రాల తరహాలో 'రామయాణ' చిత్రాన్ని నితేష్ రూపొందిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమాలోని నా పాత్రకు చెందిన డెమో చూపించారు. నిజంగా ఆశ్చర్యపోయా. హనుమంతుడి పాత్ర సామాన్యమైనది కాదు. దానికోసం ఎంతో జాగ్రత్తలు వహించాలి. నిష్టగా కూడా ఉండాలి. అందుకు తగ్గట్టుగా తయారవుతున్నా. కచ్చితంగా అందరికీ నచ్చే సినిమా అవుతుంది.' అని సన్నీడియోల్ తెలిపారు. కైకేయిగా లారాదత్తా, శూర్పనఖగా రకుల్ ప్రీత్‌సింగ్ నటిస్తున్నారు. రెండు భాగాలుగా సినిమా తెరకెక్కుతున్నది. తొలి పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి, మలి పార్ట్ 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

# సందేశాత్మకంగా 'డియర్ ఉమ'



సుమయరెడ్డి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. ఈ సినిమాకు ఆమె నిర్మాణ బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు రచయితగా కూడా పనిచేశారు. పృథ్వీ అంబర్ కథానాయకుడు. సాయిరాజేష్ మహాదేవ్ దర్శకుడు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. 'గుడిలో దేవుడి వద్ద చేసే ప్రార్థనల కన్నా, హాస్పిటల్‌లో నాలుగు గోడల మధ్య చేసే ప్రార్థనలే ఎక్కువ' అనే సంభాషణతో మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. వైద్య వ్యవస్థ నేపథ్యంలో సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని టీజర్‌ను బట్టి అర్థమవుతున్నది. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్‌ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రధన్, దర్శకత్వం: సాయిరాజేష్ మహాదేవ్.



# 'క్రిష్' ఫ్రాంచైజీలో రీఎంట్రీ

'క్రిష్' ఫ్రాంఛైజీ చిత్రాలు బాలీవుడ్‌లో బాక్సాఫీస్ రికార్డులు సృష్టించాయి. ఈ సిరీస్‌లో భాగంగా త్వరలో 'క్రిష్-4' తెరకెక్కనుంది. ఈ చిత్రానికి హృతిక్‌రోషన్ దర్శకత్వం వహిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. నాలుగో భాగాన్ని టైమ్ ట్రావెల్ కథాంశంతో దాదాపు 700కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో హృతిక్‌రోషన్ త్రిపాత్రాభినయంలో కనిపిస్తారని తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇప్పటికే క్రిష్ ఫ్రాంఛైజీలో భాగమై మంచి పేరు తెచ్చుకున్న ప్రీతిజింతా..నాలుగో పార్ట్‌లో నటించనుందని తెలిసింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న ప్రీతిజింతా 'క్రిష్-4' చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుందని తెలిసింది. ప్రియాంకచోప్రా, వివేక్ ఒబెరాయ్, రేఖా తదితరులు ఈ నాలుగో భాగంలో నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం 'వార్-2' షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నారు హృతిక్‌రోషన్. ఇది పూర్తయిన వెంటనే 'క్రిష్-4'ను సెట్స్‌పైకి తీసకెళ్తారని తెలిసింది.



# మా నాయనా ఓ మాట చెప్పినాడు..

అక్కినేని అఖిల్ నటిస్తున్న తాజా చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో లవ్, యాక్షన్ ప్రధానంగా సాగే కథాంశమిది. మురళీకిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు. మంగళవారం అఖిల్ పుట్టినరోజుని పురస్కరించుకొని టైటిల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. ఇందులో అఖిల్ గుబురు గడ్డం, మీసాలతో పక్కా మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. 'గతాన్ని తడుముకుంటూ పోతూ మా నాయనా ఓ మాట చెప్పినాడు.. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుంది రా.. పేరు ఉండదు. పోయేటప్పుడు ఊపిరి ఉండదు, పేరు మాత్రమే ఉంటుంది అని' అంటూ అఖిల్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్‌తో టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. విజువల్స్ కట్టిపడేశాయి. తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకుంది. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది కాదు' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రేమకోసం కథానాయకుడి పోరాటం, సంఘర్షణ ప్రధానాంశాలుగా ఉంటాయని గ్లింప్స్‌ను చూస్తే అర్థమవుతున్నది. భారీ యాక్షన్ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు.

# హృతిక్ హీరోగా మైత్రీ సినిమా?



చిత్ర నిర్మాణంలో మైత్రీ మూవీ మేకర్స్ దూకుడు మామూలుగా లేదు. ఒకే టైమ్‌లో చిరంజీవి, బాలకృష్ణలతో సినిమాలు తీయడమే కాక, రెండిటినీ సంక్రాంతి బరిలోకి దింపి.. తమతో తామే పోటీ పడ్డ క్రెడిట్ మైత్రీ వారిది. ఈ నెల 10న ఆ సంస్థ నుంచి 'జాట్' సినిమా రానుంది. బాలీవుడ్ స్టార్ సన్నీడియోల్ హీరోగా, టాలీవుడ్ డైరెక్టర్ మలినేని గోపీచంద్ దర్శకత్వంలో నిర్మించిన ఈ హిందీ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ఇదిలావుంటే.. ఈ వేడిలోనే మరో బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్‌తో కూడా ఓ సినిమా చేసేందుకు మైత్రీవారు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. టాలీవుడ్ డైరెక్టర్ కె.ఎస్.రవీంద్ర(బాబీ) ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారట. ఇటీవలే హృతిక్‌కి బాబీ కథ కూడా వినిపించారట. దానికి హృతిక్ ఓకే చెప్పినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం హృతిక్ 'వార్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత 'క్రిష్ 4' ఎలాగూ ఉంది. పైగా ఆ సినిమా ద్వారా హృతిక్ దర్శకుడిగా కూడా పరిచయం కానున్నారు. మరి ఇంత బిజీ షెడ్యూల్‌లో బాబీకి హృతిక్ ఛాన్సిస్తాడా ?.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మరి ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఆ విషయం ఇంట్లో కూడా చెప్పలేదు..



'హీరోయిన్ కావడం నా చిన్ననాటి కల. ప్రయత్నిస్తున్నప్పుడు స్థాయిని మించి ఆశిస్తున్నానా?! అనే మీమాంస మనసులో ఉండేది. కానీ నిజంగానే హీరోయిన్‌ని అయ్యాను. విజయాలు అందుకున్నా. ఇదంతా గాడ్ గిఫ్ట్.' అంటున్నది తెలుగమ్మాయి ప్రియాంక జువాల్కర్. రీసెంట్ హిట్ 'మ్యాడ్ స్క్వేర్'లో ఓ ముఖ్య భూమిక పోషించింది ఈ ముద్దుగుమ్మ. ఆ విజయాన్ని ఎంజాయ్ చేస్తూ ఇటీవల మీడియాతో మాట్లాడింది ప్రియాంక. 'హీరోయిన్ అవ్వాలనే నా కోరిక ఇంట్లోవాళ్లకు కూడా తెలుసు. ఈ విషయంలో వాళ్లు నన్ను ఇబ్బంది పెట్టలేదు. అందుకని ప్రత్యేకించి ప్రోత్సహించిందీ లేదు. నేనే సొంతంగా మోడలింగ్, షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఉండేదాన్ని. అనుకోకుండా 'ట్యాక్సీవాలా' ఆఫర్ వచ్చింది. అయినా నాకు నమ్మకం లేదు. అందుకే.. ఇంట్లోవాళ్లకు చెప్పలేదు. ఎందుకంటే.. సినీరంగంలో ఎప్పుడు ఏమైనా జరగొచ్చు. ఉన్నట్టుంది నన్ను తీసేసి, ఇంకో హీరోయిన్‌ని పెట్టేయొచ్చు. అందుకే.. ఇంట్లో చెప్పలేదు. ఒక షెడ్యూల్ అయిన తర్వాత, అప్పుడు చెప్పాను. గీతా ఆర్ట్స్ లాంటి గొప్ప సంస్థ నిర్మిస్తున్న సినిమాతో హీరోయిన్ కావడం పట్ల ఇంట్లో వాళ్లు కూడా ఆనందం వెలిబుచ్చారు. దానికి తగ్గట్టే సినిమా కూడా హిట్ అయ్యింది.' అంటూ గతాన్ని నెమరువేసుకున్నది ప్రియాంక జువాల్కర్.

# సమయం పడుతుంది కాస్త ఓపిక పట్టండి..



ప్రభాస్ 'ది రాజాసాబ్' సినిమా కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ కెరీర్‌లో రూపొందుతోన్న తొలి కామెడీ హారర్ మూవీ ఇది. ఈ తరహా సినిమాలు తెరకెక్కించడంలో దర్శకుడు మారుతి సిద్ధహస్తులు. ప్రభాస్ లాంటి సూపర్‌హీరోతో హారర్ కామెడీ అనగానే.. ఆడియన్స్‌లో విపరీతమైన ఆసక్తినెలకొని ఉంది. తాజాగా దర్శకుడు మారుతి సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఇంటరాక్టయ్యారు. ఈ సందర్భంగా ఓ అభిమాని.. 'మీకు సంతృప్తి అనిపించినప్పుడే సినిమా రిలీజ్ చేయండి.. కావాల్సినంత సమయం తీసుకోండి.. పర్లేదు. నవంబరైనా, వచ్చే ఏడాదైనా మేం బాధపడం. అయితే.. రిలీజ్ విషయంలో అధికారికంగా సమాచారం ఇవ్వండి. అప్పుడు అభిమానులు మిమ్మల్ని ఇబ్బంది పెట్టరు.' అని పేర్కొన్నాడు. దానిపై దర్శకుడు మారుతి స్పందిస్తూ.. 'కొంచెం టాకీ పార్ట్, కొన్ని పాటలు బ్యాలెన్స్ ఉన్నాయి. అవి పూర్తవ్వగానే లిరికల్ వీడియోలు విడుదల చేస్తాం. ఈ సినిమాకు సీజీ వర్కే ప్రాణం. ఆ పనిమీదే పలు సీజీఐ స్టూడియోలు పనిచేస్తున్నాయి. కొన్ని స్టూడియోల అవుట్‌పుట్ బాగుంది. ఇంకొన్ని స్టూడియోల వర్క్ కోసం వెయిట్ చేస్తున్నాం. ఈ ప్రాసెస్‌లో ఎన్నో అంశాలు ఇన్వాల్వ్ అయివున్నాయి. ఇది ఒక్కరు చేసే పనికాదు. సమయం పడుతుంది. సీజీ వర్క్ వెరిఫికేషన్ అవ్వగానే నిర్మాతలే రిలీజ్ డేట్ ప్రకటిస్తారు. అంచనాలు అందుకునేందుకు అంతా కష్టపడుతున్నాం. కాస్త ఓపిక పట్టండి.' అంటూ మారుతి చెప్పుకొచ్చారు.

# నాగసాధువు దుష్టసంహారం



అగ్ర కథానాయిక తమన్నా నటిస్తున్న సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల-2'. ఇందులో ఆమె నాగసాధువు భైరవి పాత్రలో కనిపించనుంది. అశోక్‌తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అగ్ర దర్శకుడు సంపత్‌నంది క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనే కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలందించారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ముంబయిలో జరిగిన ఈవెంట్‌లో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ దుష్టశక్తి నుంచి ఓదెల గ్రామానికి పొంచి ఉన్న ముప్పు గురించి తెలుసుకున్న అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతారు. తమ జీవితాలను చీకటి కబళించబోతున్నదని ఆవేదన చెందుతారు. అలాంటి సమయంలో వారిని రక్షించడానికి నాగసాధువు గ్రామంలోకి ప్రవేశిస్తుంది. చెడుని ఎదుర్కోవాలని ప్రతిజ్ఞ చేస్తుంది. ఈ నేపథ్యంలో నడిచే పరిణామాలతో టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. నాగసాధువుగా తమన్నా నటన, విజువల్ ఎఫెక్ట్స్ హైలైట్‌గా నిలిచాయి. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్, దర్శకత్వం: అశోక్‌తేజ.

# తెలంగాణ నేపథ్యంలో 'దండోరా'



శివాజీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఇటీవలే రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టారు. 25 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో శివాజీ పాల్గొంటున్నారు. ఆయనపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ, గ్రామాల్లో భూస్వాముల దౌర్జన్యాలపై సామాన్యుల తిరుగుబాటును చూపించే చిత్రమిదని, చక్కటి హాస్యం..వ్యంగ్యంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని మేకర్స్ తెలిపారు. నవదీప్, నందు, రవికృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మార్క్ ఆర్ రాబిన్, దర్శకుడు: మురళీకాంత్.





